## ట్రస్మా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

చిక్కడపల్లి, మే 20: ప్రభుత్వ అనుమతి పొందిన ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ మేనేజ్‌మెంట్స్ (ట్రస్మా) ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయమనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పేద మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఫ్రీ ఎడ్యుకేషన్ అమలు చేయాలని అన్నారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా హక్కు చట్టం అమలు చేసేంత వరకు పోరాటం చేస్తామని అన్నారు. ప్రభుత్వం బకాయిలు ఇవ్వడం లేదనే సాకుతో ఈ నిర్ణయాన్ని తీసుకోవడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, అంతేకాకుండా బుక్స్, యూనిఫామ్స్ పేరుతో భారీగా డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఫీజులు నిర్ణయించక ముందే ఇష్టానుసారంగా 10 నుంచి 30 శాతం వరకు ఫీజు పెంచుతున్నారని అన్నారు.

## ఘనంగా ప్రకాశం పంతులు జయంతి



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ తదితరులు

సికింద్రాబాద్, మే 20: టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి సందర్భంగా నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి ఘనంగా జరిపారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన చూపించిన మార్గం మనకు ఎల్లప్పుడూ ప్రేరణనిస్తూనే ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- టీపీజేఏసీ, ఎంపీఎం సంయుక్తాధ్వర్యంలో కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన
- కనీస వేతనాలకూ నోచుకోని అసంఘటిత రంగంలోని కార్మికులు
- కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని మండిపడిన జేఏసీ నేతలు




ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు రవి, తదితరులు

చిక్కడపల్లి, మే 20: రాష్ట్రంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే పర్చాలని పలువురు కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ), ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక (ఎంపీఎం) సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల వ్యతిరేకిస్తూ మంగళవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీజేఏసీ కోకన్వీనర్ కన్నెగంటి రవి, రవి చందర్, నాయకులు మీరా సంఘమిత్ర, ఖలీదా పర్వీన్, పి.శంకర్, శివ కుమార్, సామ్రాజ్యం, సిస్టర్ లిజీ, జయలక్ష్మి తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో దశాబ్దాలుగా కార్మికుల, ముఖ్యంగా అసంఘటిత కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. అసంఘటిత రంగంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులను, శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కార్మికులు, ప్రైవేట్ రంగ సంస్థల ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా రాష్ట్ర కార్మిక శాఖను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



బండ మైసమ్మ డబుల్ బెడ్రూం కాలనీవాసులతో సమావేశమైన కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్, మే 20: బండ మైసమ్మ బస్తీలోని డబుల్ బెడ్రూం కాలనీలో సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ కె.హేమలత అన్నారు. మంగళవారం బస్తీవాసులు ఆమెను కలిసి తమ సమస్యలను వివరించారు. రోజువారి వాడుక నీటి పవర్ బోరు పాడైందని, తాగునీటి సరఫరా తగ్గిందని తెలిపారు. లిఫ్టులు పనిచేయకపోవడం వల్ల పై అంతస్తుల్లో ఉన్న వారికి ఇబ్బందిగా మారిందని విన్నవించారు. ఖాళీగా ఉన్న దుకాణాలను వెంటనే బస్తీవాసులకు కేటాయించాలని, బస్తీలోని కొందరు తాగుబోతులు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, తమ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. సమస్యలను తాను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ హేమలత అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు కె.లక్ష్మిపతి, బస్తీవాసులు శంకర్, పరమేష్, రాజు, స్వర్ణ, రాణి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి పైపులైన్ పనుల ప్రారంభం



బ్రాహ్మణబస్తీలో పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమ తదితరులు

సికింద్రాబాద్, మే 20: వేసవి కాలంలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని బ్రాహ్మణ బస్తీలో ఉజ్జయిని హైస్కూల్ వద్ద కార్పొరేటర్ హేమ అధికారులు, నాయకులతో కలిసి తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రూ.15 లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం తన ప్రధాన బాధ్యత అని అన్నారు. నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో బ్రాహ్మణబస్తీలో మంచినీటి సరఫరా కోసం పనులు ప్రారంభించామని అన్నారు. ఎమ్మెల్యే చొరవతో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసేలా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ నవ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 17 బీసీ కులాలను ఎంబీసీలుగా గుర్తించాలి

మారేడ్‌పల్లి, మే 20: 17 బీసీ కులాలను ఎంబీసీలుగా గుర్తించి వారి విద్య, ఉద్యోగ, ఆర్థిక రాజకీయ అభివృద్ధికి న్యాయం చేయాలని పలువురు బీసీ ఫెడరేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కమ్మరి మోహన్ చావన్ ఆధ్వర్యంలో మంగళవారం బీసీ కులాల రాష్ట్రస్థాయి సమాఖ్య సమావేశం సికింద్రాబాద్‌లోని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథులుగా బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు, అధికార ప్రతినిధి భాస్కరుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చుక్కల శ్రీకాంత్ హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 17 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చేలా ఢిల్లీలో బీసీ కమిషన్ చైర్మన్ హంస రాజు గంగారాం అహిర్‌ను స్వయంగా కలిసి విషయాన్ని వెల్లడించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు సరైన గుర్తింపు లేని వర్గాలకు న్యాయం జరిగేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో వీటికి సంబంధించిన కార్యాచరణను త్వరలో ప్రారంభిస్తామని సమావేశంలో వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డిని త్వరలో కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు వెల్లడించారు. 17 బీసీ కులాల రాష్ట్ర అధ్యక్షులు సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం ప్రతినిధులు

## ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నూతన ఇన్‌స్పెక్టర్ కిరణ్ బోస్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్, మే 20: గాంధీనగర్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.కిరణ్‌బోస్‌ను మంగళవారం బన్సీలాల్ పేట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు. బీఆర్ఎస్ నేతలు కె.లక్ష్మిపతి, అబ్బాస్, అయూబ్, శ్రీనివాస్, శివ, నాగభూషణం, విజయ్‌పాల్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు

మొహిదీపట్నం, మే 20: చికిత్స కోసం వెళ్లి డాక్టర్, కాంపౌండర్లపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ నాంపల్లి 16వ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ మంగళవారం తీర్పు ఇచ్చిందని హబీబ్‌నగర్ సీఐ పురుషోత్తం తెలిపారు. హబీబ్‌నగర్ క్రాస్‌రోడ్‌లో మాజీద్ 2019లో నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లాడు. డాక్టర్, కాంపౌండర్లపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో మాజీద్‌పై కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించింది.

## రాచరికంపై పోరాడిన ధీశాలి బండి యాదగిరి




సభలో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి కాశీ విశ్వేశ్వరరావు

ముషీరాబాద్, మే 20: నిజాం సైన్యాన్ని గడగడలాడించిన బండి యాదగిరి పీడిత ప్రజానికానికి ఆశాదీపంలా నిలిచారని విశ్రాంత న్యాయమూర్తి కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. నిజాం రాచరిక పాలనపై పోరాడిన ధీశాలి కొనియాడారు. త్యాగరాయ గానసభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా మంగళవారం విప్లవ కవి బండి యాదగిరి సంస్మరణ సభ జరిగింది. ప్రపంచ చరిత్రలో ప్రాచుర్యం పొందిన వీర తెలంగాణ పోరాట ఘట్టంలో స్వయంగా రాసి పాడిన 'బండెనక బండి గట్టి' పాట నేటికీ పోరాట స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. సాయుధ పోరాట సైరన్ శబ్దాల్ని గమనించి ఉక్కు మనిషిలా పిడికిలి బిగించి, దొర కింద చేసే చాకిరికి స్వస్తి చెప్పి, జనం కోసం యుద్ధ భూమిలో తన ప్రాణాలను త్యాగం చేసిన వీరుడు అని వివరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మానస ఆర్ట్స్ సంస్థ అధినేత రఘుశ్రీ, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు ఎస్‌బీ రామ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## దాడి ఘటనలో హిజ్రాల అరెస్టు

- నిందితుల నుంచి రూ.10వేల నగదు స్వాధీనం
- సమావేశంలో వివరాలు వెల్లడించిన రైల్వే డీఎస్పీ జావెద్



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావెద్

మారేడ్‌పల్లి, మే 20: రైళ్లలో ప్రయాణికులపై దాడి చేస్తూ, బలవంతంగా డబ్బులు లాక్కున్న ముగ్గురు హిజ్రాలతో పాటు మరో మైనర్‌ను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రూ.10 వేలు పోలీసులు రికవరీ చేశారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్‌గౌడ్‌తో కలిసి రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావెద్ కేసు వివరాలను వెల్లడించారు. మేడ్చల్ జిల్లా, షాపూర్‌నగర్‌కు చెందిన పల్లి సూర్యభాను ప్రకాశ్ అలియాస్ జాన్వి (24) మాదాసు విజయ్ అలియాస్ వినీత (24), చెరుకు సాయికుమార్ అలియాస్ సాత్విక (31)తో పాటు మరోక మైనర్ బాలుడు హిజ్రాలుగా మారారు. రైళ్లలో ప్రయాణికులను బెదిరించి డబ్బులను లాక్కొని పారిపోతుంటారు. ఈ నెల 12న తెల్లవారు జామున ముగ్గురు హిజ్రాలతో పాటు మైనర్ బాలుడు కలిసి మౌలాలి రైల్వే స్టేషన్ దాటిన తరువాత ప్రయాణికుల నుంచి డబ్బు వసూలు చేయడం ప్రారంభించారు. ఓ యువకుడిని డబ్బులు డిమాండ్ చేయగా నిరాకరించడంతో అతడిపై దాడిచేసి పర్సులోని రూ.10 వేలు లాక్కొన్నారు. రైలు జనగాంకు చేరుకునే క్రమంలో నెమ్మదించిన సమయంలో రైలు దిగి పారిపోయారు. దాడికి గురైన బాధితుడు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం నిందితులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకోవడంతో అప్పటికే నిఘా పెట్టిన రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించారు. ముగ్గురు హిజ్రాలతో పాటు మైనర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

అంబర్‌పేట: సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని నల్లకుంట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి మోటార్ సైకిల్, వీవో వై22 మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నల్లకుంట డీఐ ఎ.రాములు, ఇన్‌స్పెక్టర్ బి.జగదీశ్వర్‌రావులతో కలిసి ఓయూ ఏసీపీ జగన్ మంగళవారం వివరాలు వెల్లడించారు. నల్లకుంటకు చెందిన ఓ వ్యక్తి ఈ నెల 19న శివం రోడ్డు యాక్సెస్ బ్యాంకు వద్ద ఉన్న పాన్‌షాపునకు వచ్చి పాన్ తీసుకొని ఇంటికి వెళ్తుండగా ఇది గమనించిన ముగ్గురు యువకులు అతని చేతిలో ఉన్న మొబైల్‌ను దొంగిలించి బైక్‌పై పరారయ్యారు. వెంటనే అతడు నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు పరిశీలించి మంగళవారం ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు అంబర్‌పేట పోచమ్మబస్తీలో నివాసముంటున్న కర్ణాటక, రాయిచూర్ జిల్లా జుకూర్‌కు చెందిన ప్రనేష్‌గా గుర్తించారు. ఇతను గార్బేజీ వెహికిల్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రెండో వ్యక్తి బతుకమ్మకుంట, రామకృష్ణహట్స్‌లో నివాసముండే చిగుర్ల యాదగిరి కుమారుడు సురేష్, ఇతను జీహెచ్ఎంసీ చెత్తను సేకరించే ఆటో డ్రైవర్. మూడో వ్యక్తి అరుణ్ కుమార్ (లేబర్). బాగ్ అంబర్‌పేట బుర్జుగల్లీలో ఉంటున్నాడు. అనంతరం ఈ ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

# ఎంపీ వంశీకృష్ణకు క్షమాపణ చెప్పాలి



ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

కవాడిగూడ, మే 20: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు జరిగిన అవమానం యావత్ దళితులకు జరిగిన అవమానమని ఆలిండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు రాజు వస్తాద్ అన్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని, దీనికి కారణమైన ప్రభుత్వ అధికారులు తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం సరస్వతి పుష్కరాల్లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ప్రోటోకాల్ పాటించకుండా వివక్ష చూపడాన్ని నిరసిస్తూ రాజు వస్తాద్ ఆధ్వర్యంలో పలు మాల సంఘాలు మంగళవారం ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజు వస్తాద్ మాట్లాడుతూ సరస్వతి పుష్కరాలకు ఎంపీ వంశీకృష్ణను ఆహ్వానించకపోవడం సరికాదన్నారు. ప్రోటోకాల్ ఆహ్వానంలో ఆయన ఫొటో లేకపోవడం బాధాకరమైన విషయమని, దీనిపై ప్రభుత్వం స్పందించక పోవడం యావత్ దళిత జాతికి అవమానకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడైనందుకే వంశీకృష్ణను పుష్కరాలకు ఆహ్వానించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సొంత పార్టీ ఎంపీకి అవమానం జరిగితే మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ, ప్రభుత్వ అధికారులు వంశీకృష్ణకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నాలో మాల సంఘాల నాయకులు జి.చెన్నయ్య, కరణం కిషన్, బిట్ల వెంకట్, జంగా శ్రీనివాస్, దాసరి విశాల్, బాలకృష్ణ, బలవంతరావు, నవీన్, సుధీర్, ప్రభావతి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



కార్మిక కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర సంయుక్త కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

చిక్కడపల్లి, మే 20: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని బహుజన వామపక్ష కార్మిక సమాఖ్య జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఏసీ నాయకులు కల్లెపు చంద్రశేఖరం, షేక్ షావలి, సునీత, తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, ప్రభాకర్, వై.మల్లేష్, తదితరులు మంగళవారం కార్మిక కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కనీస వేతనం రూ.30 వేలు అమలు చేయాలని, ఈపీఎఫ్ పెన్షన్ రూ.15 వేలు అమలు చెయ్యాలని అన్నారు. బీడీ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎత్తివేయాలన్నారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

## రోడ్డు విస్తరణ నిర్వాసితులను ఆదుకోవాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న జేఏసీ సభ్యులు

బొల్లారం, మే 19: రోడ్డు వెడల్పు తగ్గించి, మా జీవితాలని కాపాడాలని ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు చేపట్టే రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న నిర్వాసితులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. రాజీవ్ రహదారి (ఎస్‌హెచ్-01) పారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వరకు చేపట్టబోయే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం భూసేకరణ పునరావాస కల్పన కోసం మంగళవారం మేడ్చల్ అదనపు కలెక్టర్ హరిప్రియ అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్‌గుప్తా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన రోడ్డు విస్తరణ రెండు వందల ఫీట్లకు బదులుగా వంద ఫీట్లకు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని విస్తరణ తగ్గించి భూమి కోల్పోయిన వారికి అదేస్థాయిలో భూమిని మరొక చోట ఇవ్వాలని కోరుతూ సభను బహిష్కరించారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ హరిప్రియ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎచ్ఎండీఏ అధికారి మనోహర్, ఆర్డీవో శ్యామ్‌ప్రసాద్, సూపరింటెండెంట్ విజయ్, అసిస్టెంట్ ఎమ్మార్వో పృధ్వీ, కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాఘవేంద్రరావు, శ్రీనివాస్, అజయ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి వాహన వైభవం పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముషీరాబాద్, మే 20: జిల్లెల్ల సుబ్బరాయ శాస్త్రి 72వ జయంతి సందర్భంగా చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో మంగళవారం శ్రీవారి వాహన వైభవం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఎస్ఆర్ ఆంజనేయశర్మ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి వెంకటరామశర్మ, వారణాసి ఆంజనేయులు, సురభి శంకరశర్మ, జయరాం భట్టాచార్యులు, లక్ష్మి నరసింహచార్యులు, జిల్లెల్ల వరప్రసాద్, జగన్‌శర్మ, నరసింహమూర్తి, పార్థసారథి, పాపయ్యశాస్త్రి, జిల్లెల్ల కృష్ణకిషోర్ శాస్త్రి, చంద్రశేఖర్‌శాస్త్రి, చతుర్వేదుల నరసింహమూర్తి, దాక్షాయని, ప్రసన్నలక్ష్మి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## లింగ మార్పిడి దవాఖాన నెలకొల్పాలి

**రచన ముద్రబోయిన**

చిక్కడపల్లి, మే 20: తెలంగాణలో లింగ మార్పిడి దవాఖాన నెలకొల్పాలని ఆలిండియా ట్రాన్స్ జెండర్ హక్కుల కార్యకర్త రచన ముద్రబోయిన డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం టీపీఎస్‌కేలో తెలంగాణ హిజ్రా అండ్ ట్రాన్స్ జెండర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రచన మాట్లాడుతూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ లింగ మార్పిడి ఆపరేషన్లకు ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు కల్పించాలని అన్నారు. హిజ్రా, ట్రాన్స్ జెండర్, బైసెక్సువల్, ఇంటర్ సెక్స్, ఇంటర్ జెండర్ అందరికీ సమాజంలో వివక్ష చూపకుండా తోటి మనుషుల్లా గౌరవించాలని, సాధారణ ప్రజలకు ఉన్న హక్కులను తమకు కల్పించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం లింగ వివక్షకు తావు లేకుండా అందరికీ సమాన హక్కులు కల్పించిందని గుర్తుచేశారు. ట్రాన్స్ జెండర్ల కోసం తెలంగాణలో హిజ్రా ట్రాన్స్ జెండర్ సంక్షేమ మండలి ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ఆయుష్య, స్వేచ్ఛ, అహ్మద్ మాంగల్య తదితరులు పాల్గొన్నారు.